సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

విజయ్‌కుమార్‌కు అభినందన



సేవారత్న అవార్డు అందుకుంటున్న విజయ్‌కుమార్

అగనంపూడి: ఉక్కు ఉద్యోగి, వైఎస్సార్‌సీపీ నాయకుడు, సామాజిక కార్యకర్త జొన్నకూటి విజయ్‌కుమార్‌ను పాన్ ఇండియా సోషియో కల్చరల్ అసోసియేషన్ సేవా రత్న పురస్కారంతో సత్కరించింది. అంతర్జాతీయ సామాజికవేత్తల దినోత్సవం సందర్భంగా విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును విజయ్‌కుమార్‌కు నిర్వాహకులు ఎం.బాలగంగాధర్ తిలక్, చప్పిడి రాజశేఖర్ అందించారు. ఈ సందర్భంగా విజయకుమార్‌కు జొన్నకూటి గన్నమ్మ, కుమారి, అవినాష్, ప్రసన్న కుమార్, విజయ్‌కుమార్ తదితరులు అభినందనలు తెలిపారు.

ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ పల్లాకు సత్కారం



పల్లా శ్రీనివాసరావును సత్కరిస్తున్న కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు

గాజువాక: ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ చైర్మన్‌గా ఎన్నికైన ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును ఆ సంఘం సభ్యులు మంగళవారం కలిశారు. శాలువాతో సత్కరించి పుష్ప గుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆదర్శ గ్రౌండ్‌లో ఇండోర్ కబడ్డీ స్టేడియం ఏర్పాటు చేస్తానన్నారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉరుకూటి శ్రీనివాసరావు, కబడ్డీ క్రీడాకారులు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు ఉరుకూటి బాబూరావు, ఎం.గణపతిరావు, పల్లా బాబూరావు సత్యనారాయణ పాల్గొన్నారు.

'బీసీలకు కృష్ణయ్య వెన్నుపోటు'

అగనంపూడి: బీసీలకు వెన్నుపోటు పొడిచిన బీసీ సంఘ నేత ఆర్.కృష్ణయ్య మతతత్వ పార్టీ బీజేపీ తరఫున రాజ్యసభ బరిలో దిగడం దారుణమని ఆంధ్రప్రదేశ్ యాదవ హక్కుల పరిరక్షణ వేదిక అధ్యక్షుడు యలమంచిలి చిన అప్పారావు ఆరోపించారు. అగనంపూడిలో ఆయన మాట్లాడుతూ బీసీల గురించి, వారి హక్కుల కోసం మాట్లాడే నైతిక హక్కు కృష్ణయ్యకు లేదన్నారు. బీజేపీతో అంటకాగుతూ బీసీల అభివృద్ధికి పాటుపడతానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు.

దుమ్ము రేగుతోంది..



అక్కిరెడ్డిపాలెం వైపు లారీ వెళ్తుండగా రేగుతున్న దుమ్ము

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ పెట్రోల్ బంక్ నుంచి అక్కిరెడ్డిపాలెం వైపు వెళ్లే సర్వీసు రోడ్డు నుంచి ప్రయాణించే లారీలు దుమ్ము రేపుతున్నాయి. షీలానగర్ పెట్రోల్ బంక్ పక్కన లారీల పార్కింగ్ యార్డు ఉంది. ఈ యార్డు దుమ్ము ధూళితో నిండి ఉంటుంది. అంతేకాకుండా సర్వీసు రోడ్డు పక్కన పలువురు డేబ్రిస్ డంప్ చేస్తుండడంతో అది రోడ్డుపైకి చేరుతుంది. ఈ ప్రాంతంలో ఎక్కువగా ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల ఉండడంతో లారీలు కార్యాలయాలకు వస్తుంటాయి. అవి ప్రయాణించేటప్పుడు దుమ్ము రేగుతుంది. అ సమయంలో ద్విచక్రవాహనాలపై వెళుతున్న వారు అవస్థలు పడుతున్నారు. ఈ మార్గంలో నిత్యం ఇదే పరిస్థితి. అధికారులు సమస్యపై స్పందించాలని పలువురు వాహన చోదకులు కోరుతున్నారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు

గాజువాక

7997958388, 9912440606

బార్లా బెల్ట్‌షాపులు!



- ఏ వేళలోనైనా అందుబాటులో మద్యం
- 90 కేసుల నమోదు
- మద్యం సరఫరా చేస్తున్నవారిపై చర్యలు శూన్యం

కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఏ వేళలోనైనా మద్యం లభిస్తోంది. ఏ వీధిలో చూసినా బెల్ట్ దుకాణాలు దర్శనమిస్తున్నాయి. ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలని, నిబంధనలను అతిక్రమించి అమ్మకాలు జరిపితే లైసెన్స్‌లు రద్దు చేస్తామని అధికారుల మాటలను పెడచెవిన పెడుతున్నారు. ఎక్కడికక్కడ బెల్టు షాపులను ప్రోత్సహిస్తూ అమ్మకాలను పెంచుకొంటున్నారు. అయితే, బెల్టు దుకాణాలపై దాడులు చేస్తున్నవారు.. వాటికి మద్యం సరఫరా చేస్తున్న షాపుల జోలికి వెళ్లకపోవంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గాజువాక: గాజువాక ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ విభాగం పరిధిలో మూడు నెలల కిందట 22 మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. గతంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచిన మద్యం దుకాణాలు ప్రస్తుతం ప్రైవేట్ వ్యాపారుల చేతుల్లోకి వచ్చాయి. మద్యం వ్యాపారులు ధరలు అధికంగా పెంచకుండా చర్యలు తీసుకుంటామని, ఎమ్మార్పీని మించి మద్యం అమ్మినా, బెల్టు షాపులను ప్రోత్సహించినా సంబంధిత మద్యం వ్యాపారి లైసెన్స్‌ను రద్దు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ నిబంధనలకు వ్యాపారులు పాతరేశారు.

ఎనీటైమ్ మద్యం

బెల్టు షాపులు ఇబ్బడిముబ్బడిగా పుట్టుకొచ్చాయి. దాదాపు ప్రతి వీధిలోనూ బెల్టుషాపులు నడుస్తున్నాయి. గాజువాక ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ విభాగం అధికారులు మూడు నెలల్లో నమోదు చేసిన కేసులే ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. ఇప్పటి వరకు 90కి పైగా కేసులు నమోదు చేసినట్టు అధికారులు చెబుతున్నారు. గాజువాకలోని ప్రతి ఏరియాలోని చిన్న చిన్న దుకాణాల్లో మద్యం విస్తృతంగా లభిస్తోంది. బెల్ట్ దుకాణాల్లో ఎమ్మార్పీని మించి ధరలకు విక్రయిస్తున్నారు. ఈ విషయంపై సమాచారం అందుకొంటున్న అధికారులు బెల్టు షాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేసి అరెస్టు చేసి చేతులు దులుపేసుకొంటున్నారు.



బెల్టుషాపుపై దాడి చేసి స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు (ఫైల్)

బెల్టుషాపులకు మద్యం ఎలా వస్తోంది?

బెల్టు షాపులపై దాడులు చేసి నిర్వాహకులను అరెస్టు చేసి అధికారులు చేతులు దులుపేసుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బెల్టుషాపులకు మద్యం సరఫరా చేస్తున్నవారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. కేసులు నమోదు చేసి బైండోవర్ చేస్తున్న అధికారులు బెల్టుషాపులకు అక్రమంగా మద్యం సరఫరా చేస్తున్న వ్యాపారుల జోలికి ఎందుకు వెళ్లడం లేదన్న ప్రశ్నకు నీళ్లు నములుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి మద్యం అక్రమంగా సరఫరా చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



నిర్వాహకులను బైండోవర్ చేస్తున్న తహసీల్దార్ శ్రీవల్లి (ఫైల్)

రిటైల్‌గా కొని అమ్ముతున్నారు

బెల్టుషాపుల నిర్వాహకులు మద్యం షాపుల నుంచి రిటైల్‌గా కొని అమ్ముతున్నారు. ఒక్కో షాపు నుంచి రెండు, మూడు బాటిళ్లు కొంటారు. ఆ విధంగా రకరకాల షాపుల నుంచి కొనుగోలు చేసి అమ్ముతారు. మాకు సమాచారం వస్తే వెంటనే సంబంధిత బెల్టుషాపుపై దాడి చేసి కేసు నమోదు చేస్తున్నాం. మద్యం దుకాణం నిర్వాహకులపై కేసు నమోదు చేయడం సాంకేతికంగా సాధ్యం కాదు.

– నాగ శ్రీనివాస్, గాజువాక ఎక్సైజ్ సీఐ

జీతాలు చెల్లించాలని ఉక్కు కార్మికుల ధర్నా



ఉక్కు అడ్మిన్ వద్ద ధర్నాలో ప్రసంగిస్తున్న రాజశేఖర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు తక్షణమే పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధానకార్యదర్శి మంత్రి రాజశేఖర్, అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా జీతాలు వెంటనే చెల్లించాలంటూ బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శించారు. ధర్నాలో వారు మాట్లాడుతూ ప్లాంట్ కోసం కార్మికులు ఎంతో కష్టపడుతుంటే యాజమాన్యం జీతాలు సక్రమంగా చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. సెప్టెంబర్ నెలకు సంబంధించి 50 శాతం, అక్టోబర్‌కు సంబంధించి 35 శాతం, నవంబర్‌కు సంబంధించిన మొత్తం జీతం చెల్లించకుండా కార్మికులను ఇబ్బందులకు గురి చేయడం అన్యాయమన్నారు. ప్లాంట్ ఉత్పత్తి పుంజుకుంటూ మార్కెట్ అభివృద్ధి చెందుతున్న పరిస్థితుల్లో కూడా కార్మికులకు జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. వెంటనే జీతాలు చెల్లించకపోతే జరగబోయే కార్మిక అశాంతికి యాజమాన్యమే బాధ్యత వహించాలని వారు హెచ్చరించారు. అనంతరం సీఎండీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కారు రమణ, రమణమూర్తి, ప్రభాకరరెడ్డి, రాథోడ్, కొమ్ము ప్రసాదరావు, డి. మోహన్ తదితరులు పాల్గొన్నారు.

'పది'లో శత శాతం ఉత్తీర్ణత లక్ష్యం

డీఈవో అప్పారావునాయుడు



విద్యార్థులతో డీఈవో అప్పారావునాయుడు

అగనంపూడి: విద్యార్థులు ఉంటేనే ఉపాధ్యాయులు మనగలుగుతారని అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు అన్నారు. పరవాడ మండల పరిధిలోని పెదముషిడివాడ పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు వందరోజుల ప్రణాళిక ఎలా సాగుతుందని ఉపాధ్యాయులు, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు పాఠశాల వేళలు కంటే ఉదయం ఒక గంట, సాయంత్రం ఒక గంట ప్రత్యేక తరగతులు కోసం కేటాయిస్తున్నారని, వీటిని సద్వినియోగపర్చుకోవాలన్నారు. విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణ, ఉపాధ్యాయులు సుధాకర్, వెంకటరమణ పాల్గొన్నారు.

పినమడకలో ప్రత్యేక తరగతుల పరిశీలన

పినమడకలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఆయన పరిశీలించారు. సాయంత్రం నాలుగున్నర గంటలకు చేరుకొని విద్యార్థులతో ముచ్చటించారు. ఎలా చదవాలి, ఎంత సమయం చదవాలి అనే అంశాలపై సలహాలందించారు. విద్యార్థులంతా ప్రత్యేక తరగతులకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కొండబాబు, ఉపాధ్యాయులు పెద్దినాయుడు, నాయుడుబాబు పాల్గొన్నారు.

బొగ్గు, ఐరన్ ఓర్ గనులు కేటాయించాలి



శిబిరంలో పాల్గొన్న కార్మిక సంఘం నాయకులు

అగనంపూడి: విశాఖస్టీల్ ప్లాంట్‌కు బొగ్గు, ఐరన్ ఓర్ గనులు కేటాయించాలని ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, యు.వెంకటేశ్వర్లు కోరారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల నేతృత్వంలో కూర్మన్నపాలెంలో మంగళవారం చేపట్టిన రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ గనులను ప్రైవేటు వ్యక్తులకు ఎలా లీజుకిస్తారని ప్రశ్నించారు. రెండున్నర దశాబ్దాలుగా సొంత గనులు కేటాయించాలని మొరపెట్టుకుంటున్నా పట్టించుకోని ప్రభుత్వాలు బడా బాబుల విషయంలో అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నాయన్నారు. బొగ్గు గనులను ప్రైవేటు సంస్థలకు కేటాయించడ వల్ల ప్రజలు లక్షల కోట్ల విద్యుత్ బిల్లులు రూపంలో చెల్లించాల్సి వస్తుందన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి రంగంలో కూడా ప్రైవేటు చొరబడిందని వీళ్లంతా ప్రజల సొమ్ము దోపిడీ చేస్తుంటే ప్రభుత్వాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా వీరికి సహకరిస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు వి.ప్రసాద్, యు.మరిడయ్య, కె.బాలశౌరి, దేముడు నాయుడు, మనోజ్, అప్పలరాజు, అంజి, సుభాష్, హరిబాబు, ఎన్.వి.ఎస్. ప్రసాద్, బొండా శ్రీను, డీసీహెచ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆదర్శ స్కూల్‌ను కొత్త ప్రాంగణంలోకి తరలిస్తాం

అంగీకార పత్రం అందజేసిన పాఠశాల యాజమాన్యం



ఎమ్మెల్యే పల్లాకు అంగీకార పత్రం అందజేస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభ తదితరులు

గాజువాక: వుడా కాలనీ వినాయకనగర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో కొనసాగుతున్న ఆదర్శ స్కూల్‌ను అక్కడికి సమీపంలోనే ఉన్న మరో భవనంలోకి తరలించేందుకు ఆ పాఠశాల యాజమాన్యం అంగీకరించింది. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికల్లా కొత్త ప్రాంగణంలోకి మారుతామని పేర్కొంది. దీనికి సంబంధించిన అంగీకార పత్రాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ పి.ప్రభ, మేనేజర్ యు.కిశోర్ గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు మంగళవారం అందజేశారు. స్కూల్‌కు ఆనుకొని ఉన్న క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేయడంలో భాగంగా పాఠశాలను తరలించాలని వుడా అధికారులు గడిచిన 20 ఏళ్లుగా ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా వీఎంఆర్‌డీఏ కమిషనర్ పాఠశాల యాజమాన్యానికి ఈనెల 5న లేఖ రాశారు. గ్రౌండ్ అభివృద్ధి కోసం పనులు చేపడుతున్న దరిమిలా అక్కడి నుంచి స్కూల్‌ను తరలించాలని, దానికి సమీపంలోనే నిర్మించిన మరో భవనంలోకి వెళ్లాలని లేఖలో కోరారు. అద్దె, లీజు వంటి విషయాల్లో పాఠశాలకు అనుకూలమైన విధంగా వీఎంఆర్‌డీఏ సహకరిస్తామని పేర్కొనడంతో కొత్త ప్రాంగణంలోకి మారుతామని పాఠశాల యాజమాన్యం రాతపూర్వకంగా తెలియజేసింది.

తల్లిదండ్రుల చెంతకు తప్పి పోయిన విద్యార్థి

ఉక్కునగరం: పాఠశాల నుంచి వెళ్లిపోయిన విద్యార్థిని స్టీల్‌ప్లాంట్ పోలీసులు పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. ఉక్కునగరం సెక్టార్–3లో నివసిస్తున్న నగిరెడ్డి కృష్ణంనాయుడు కుమారుడు రుత్విక్ నాయుడు (13) డీఏవీ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. అయితే మార్కులు తక్కువ రావడంతో మంగళవారం మధ్యాహ్నం రుత్విక్ నాయుడును మందలించి తల్లిదండ్రులను తీసుకు రమ్మని చెప్పారు. దీంతో రుత్విక్ నాయుడు స్కూల్‌లో బ్యాగ్ వదిలేసి సైకిల్‌పై బయటకు వెళ్లిపోయాడు. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది చుట్టు పక్కల వెతికారు. ఈలోగా తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కేశవరావు 8 మంది సిబ్బందితో గాలింపు చేపట్టారు. ఉక్కునగరంలోనే ఆ బాలుడిని పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గాజువాక: జనవరి ఒకటి నుంచి అమలు కానున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంలో అందరూ భాగస్వాములు కావాలని కోరుతూ స్థానిక భాస్కర్ విద్యానికేతన్ విద్యార్థులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. 70వ వార్డు సచివాలయం శానిటేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారులు పాఠశాల పరిసర ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్‌ను ఉపయోగించడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్లాస్టిక కవర్ల స్థానంలో గుడ్డ సంచులను ఉపయోగించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పర్యావరణ సెక్రటరీలు రామకృష్ణ, నూకరాజు, నాయుడు, పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కరరావు, ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది విఘ్నేష్, సతీష్ పాల్గొన్నారు.

చెత్త తొలగించారు

సాక్షి ఎఫెక్ట్..



చెత్త తొలగించిన తర్వాత కోరాడ ప్రధాన రహదారి



సాక్షిలో ప్రచురితమైన కథనం

పెదగంట్యాడ: జీవీఎంసీ 73,75,76 వార్డుల్లో ప్రధాన రహదారుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని మంగళవారం అధికారులు తొలగించారు. ఏ వార్డులో చూసినా చెత్తకుప్పలు పేరుకుపోవడంతో స్థానికులు అవస్థలు పడేవారు. ఈ నేపథ్యంలో 'ముంచెత్తగా' శీర్షికన 'సాక్షి' దినపత్రికలో సోమవారం ప్రచురితమైన కథనానికి జీవీఎంసీ అధికారులు స్పందించారు. 73వ వార్డు వుడా కాలనీ ప్రధాన రహదారి, 76వ వార్డు నడుపూరు ప్రధాన రహదారితో పాటు 64వ వార్డు యాతపాలెం ప్రధాన రహదారి, 74వ వార్డు హనుమాన్ మందిరం ఎదురుగా, 75వ వార్డు కోరాడ ఆలయాల వద్ద, 65వ వార్డు భవానీ నగర్ ప్రధాన రహదారుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. పూర్తి స్థాయిలో శుభ్రం చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



పరిశుభ్రంగా నడుపూరు ప్రధాన రహదారి

స్పందించారు.. చెత్త తొలగించారు



చెత్తా చెదారాన్ని పొక్లెయిన్‌తో తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది



చెత్త తరలించిన తర్వాత విశాలంగా రహదారి

అగనంపూడి: మరీ ఇంత 'చెత్త' రోడ్డా..! అనే శీర్షికతో 'సాక్షి'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి జీవీఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది స్పందించారు. అగనంపూడి నుంచి ఉక్కు జనరల్ ఆస్పత్రికి వెళ్లే మార్గంలో శనివాడ కూడలి నుంచి ఏలేరు కాల్వ వరకు అరకిలోమీటరు దూరం వరకు చెత్త పోగులు తొలగించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు దగ్గరుండి పొక్లెయినర్, ట్రాక్టర్లతో చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించి సిబ్బందితో పరిశుభ్రం చేయించారు. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే వారు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

మూకాభినయంలో ద్వితీయ స్థానం



మూకాభినయంలో ద్వితీయ స్థానం నిలిచి బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

పెదగంట్యాడ: రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శనకు ద్వితీయ స్థానం లభించింది. ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో మూకాభినయం ప్రదర్శించిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నెల 9, 10 తేదీల్లో విజయవాడలో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో కూడా విద్యార్థులు సెల్ ఫోన్ వల్ల కలిగే అనర్థాలను మూకాభినయంతో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. డ్రామా విభాగంలో ఒక్క డైలాగ్ కూడా లేకుండా కేవలం హావభావాలతో ఈ ప్రదర్శనతో ఆలోచింపజేశారు. సెల్‌ఫోన్‌కు బానిసలైన వారు ప్రవర్తించే తీరును, వారు తమ జీవితాలను ఎలా నాశనం చేసుకుంటున్నారో కళ్లకు కట్టారు. ప్రదర్శనలో పాల్గొన్న కౌశిక్, మనోహర్, సాయికుమార్, అరవింద్ సాహు, చరణ్‌లను ఎస్‌ఈఆర్‌టీ డైరెక్టర్ కృష్ణారెడ్డి అభినందించారు. శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్ అభినందించారు.

అపూర్వ కలయిక.. ఆనంద గీతిక

అగనంపూడి: మూడున్నర దశాబ్దాల నాటి ముచ్చట్లతో మురిసిపోయారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా మంగళవారం 1990-91 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. బాణ పొట్టలు.. తలపై సగం ఖాళీ అయిన పట్టలతో ఐదు పదుల వయసు కనపడకుండా కప్పిపుచ్చుకుంటూ కుశల ప్రశ్నలతో సందడి చేశారు. అలనాటి గురువులు చెప్పిన చదువులు, నీతులను గుర్తు చేసుకుంటూ ఆయా గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల ప్రతినిధులు దుగ్గపు దానప్పలు, బలిరెడ్డి నాగేశ్వరరావు, ఆరంగి సత్యనారాయణ, కొణతాల సూరిబాబు, కంచు రమణారావు, పితాని సూర్యనారాయణ, అంగటి కృష్ణ, ఎల్లపు నూకరాజు, తుంపాల శ్రీను, రీసు శ్రీను పాల్గొన్నారు.



5న చలో విజయవాడ



నెల్లిముక్కు రామాలయం ప్రాంగణంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

పెదగంట్యాడ: విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో వచ్చే నెల 5న విజయవాడలో నిర్వహించనున్న హైందవ ధర్మం ప్రసంగం కార్యక్రమానికి తరలిరావాలని గొందేశి గురప్ప రెడ్డి పిలుపునిచ్చారు. జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని నెల్లిముక్కు రామాలయంలో మంగళవారం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మం పరిరక్షణ కోసం, భారతీయ సంస్కృతి సంప్రదాయాల కోసం నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం నెల్లిముక్కులో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంపాడ వెంకటరమణ, నీలాపు అప్పలస్వామి, మాదాబత్తుల వెంకట్, గొందేశి అప్పలనర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

గాజువాక

9912222749, 9705347420, 9705933394

Office mail : sakshiadvtvsp@gmail.com